క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కంచరకుంట, సాయినగర్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు, ప్రశాంత్‌నగర్, టీచర్స్ కాలనీ, ఎక్సైజ్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈనెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ధర్మారం, పోతరాజుపల్లి ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

నేడు బాలవికాసలో చర్చ

కాజీపేట రూరల్: వరంగల్ మహానగర ఏకీకరణ, పునర్నిర్మాణంపై కాజీపేట ఫాతిమానగర్‌లోని బాలవికాస ట్రెనింగ్ సెంటర్‌లో మంగళవారం చర్చ కార్యక్రమం ఉంటుందని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ తెలిపారు.

రేపు జన జాగరణ

న్యూశాయంపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు నిరసనగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 14న రాత్రి హనుమకొండ చౌరస్తాలో జన జాగరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.వాసుదేవరెడ్డి తెలిపారు. హనుమకొండ రాంగనగర్‌లోని కార్యాలయంలో ప్రజాసంఘాల సంయుక్త సమావేశం సోమవారం జరిగింది. ప్రజాసంఘాల నాయకులు రాగుల రమేష్, ప్రభాకర్ రెడ్డి, వీరన్ననాయక్, గొడుగు వెంకట్, సంపత్, దీప, రమ తదితరులు పాల్గొన్నారు.

వరి పంట క్షేత్రాల పరిశీలన

మామునూరు: మామునూరు పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో దత్తత గ్రామాల్లో వరి పంటలను వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాజు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వరి కాండం కుళ్లు తెగులును పరిశీలించారు. వరి తెగులు నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు.

జర్నలిస్ట్ కుటుంబానికి చేయూత



నయీంనగర్: ఇటీవల మృతిచెందిన జర్నలిస్ట్ యోగిరెడ్డి కుటుంబానికి చక్రవర్తి ఆస్పత్రి ఎండీ డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈమేరకు ఆయనను ప్రెస్ క్లబ్‌లో జర్నలిస్టులు సోమవారం అభినందించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



వరంగల్: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన బండెల రవి కొన్ని రోజులుగా ఊపిరితిత్తులు, మూత్రపిండాల సమస్యతో బాధపడుతున్నాడు. ఈమేరకు బాధితుడికి వరంగల్‌కు చెందిన యువ నేతాజీ ఫౌండేషన్ సభ్యుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ రూ.8500లను సోమవారం అందించారు. హనుమకొండలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు సుమన్ తెలిపారు.

టీపీసీసీ లీగల్ సెల్ జిల్లా కమిటీ నియామకం


శ్రీనివాస్, చైర్మన్


రమేష్, కన్వీనర్

వరంగల్ లీగల్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వరంగల్ జిల్లా కమిటీ చైర్మన్‌గా శామంతుల శ్రీనివాస్, కన్వీనర్‌గా కొక్కొండ రమేష్‌ను నియమిస్తూ టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, కమిటీ వైస్ చైర్మన్లుగా ఈ.ఆనంద్‌మోహన్, మొహమ్మద్ ఆజాం, గునిగంటి శ్రీనివాస్, ఎజ్జగిరి సురేష్, కొడిదల సంజయ్‌కుమార్, గంప వెంకటరమణ, జాయింట్ కన్వీనర్లుగా జీవీ రమణమూర్తి, గన్ను హరిహర కుమార్, ఎం.శ్రీనాథ్‌బాబు, రొడ్డ అమృత్‌రావు, రాచర్ల సురేష్, మొహమ్మద్ జానీ ఎన్నికయ్యారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి

విద్యారణ్యపురి: విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల హక్కుల కోసం దేశ వ్యాపితంగా స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్) పోరాటం చేస్తోందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ అన్నారు. ఎస్టీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాటికాయల కుమార్, రవీందర్‌రాజు, పెండెం రాజు, దామోదర్, బాధ్యులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం



కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, ఉద్యోగులు



కేయూలో కేంద్ర గ్రంథాలయంలో..



హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

కేయూ క్యాంపస్: లైబ్రరీని విద్యార్థులు వినియోగించుకోవాలని, పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెరుగుతుందని కేయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహేందర్ అన్నారు. కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో లైబ్రేరియన్స్ డేను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు ఆర్ఎస్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సూపరింటిండెంట్ బొల్నెపాక ప్రభాకర్, ఉద్యోగులు మహ్మద్ యూనస్, డాక్టర్ సంగాల ఎఫ్రిమ్‌రాజు, సంగాల రాజమౌళి, నర్మద, లావణ్య, శోభారాణి, రాహుల్, కిషోర్, పున్నం పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

కేయూ క్యాంపస్: గ్రంథాలయాల సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడు, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్‌లాల్ సూచించారు. గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్ 132వ జయంతి సందర్భంగా కేయూలోని కేంద్ర గ్రంథాలయంలో కేయూ లైబ్రరీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, తెలంగాణ గ్రంథాలయ శాఖ, కేయూ గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో లైబ్రేరియన్స్ డేను సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రరీ సైన్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ రమణయ్య, లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ షమిత, లైబ్రరీ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణి, అసోసియేషన్ బాధ్యులు వేదాంతం కృష్ణమాచార్య, కొండల్‌రెడ్డి, సత్యనారాయణ, మనోహర్‌రావు, రాజేశ్వర్‌రావు, ఇజాక్ ప్రభాకర్, జవహర్, రిటైర్డ్ ఉద్యోగులు కోటేశ్వర్‌రావు, అంజయ్య, యుగేందర్‌రావు, డాక్టర్ జయప్రకాశ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు. యూనివర్సిటీలో ఎంఎల్ఐఎస్సీ కోర్సులో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థి అఖిలకు బంగారు పతకాన్ని ప్రదానం చేశారు. కిట్స్ ఇంజనీరింగ్ లైబ్రేరియన్ ఇంద్రసేనారెడ్డిని ఉత్తమ లైబ్రేరియన్‌గా గుర్తించి అవార్డు అందజేశారు. అలాగే ఉత్తమ చదువరిగా ఎంబీఏ విద్యార్థి ప్రియాంకకు అవార్డు అందజేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం లైబ్రేరియన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ధర్మేంద్ర మాట్లాడుతూ టెక్నాలజీకి అనుగుణంగా గ్రంథాలయాల్లో మార్పులు వస్తున్నాయని చెప్పారు. పుస్తక పఠనంను ప్రతిఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం కళాశాల లైబ్రేరియన్ రాజేశ్వర్ కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీధర్, కవిత, యాకూబ్, రాజ్‌కుమార్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మృతిచెందిన ఉద్యోగులకు నివాళులర్పిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

రామన్నపేట: సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దుండిగల్ యాదగిరి, జి.యూన్నీసౌజన్య డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారి, పనిఒత్తిడి కారణంగా హఠాన్మరణం చెందిన పలువురు సమగ్ర శిక్ష ఉద్యోగులకు మృతికి సంతాపంగా సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు తక్షణమే కనీస వేతనం అమలు చేయాలని, ఆరోగ్య బీమా రూ.5 లక్షలు, జీవిత బీమా రూ.10 లక్షలు, ఉద్యోగ విరమణ అనంతరం రూ.10 లక్షల ప్రయోజనం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం పరిష్కరించకుంటే దశలవారీగా నిరసనలు చేస్తామని హెచ్చరించారు.

ఉత్తమ ఆలోచనలు కలిగి ఉండాలి



మాట్లాడుతున్న రాణిమణి

హసన్‌పర్తి: విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉత్తమ అలవాట్లు, ఆలోచనలు కలిగి ఉండాలని జిల్లా సంక్షేమాధికారి రాజమణి తెలిపారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, విద్యారణ్యపురి ఆధ్వర్యంలో భీమారంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సంస్కార వికాస శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌పై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. సీడబ్ల్యూసీ సభ్యుడు కజాంపురం దామోదర్ మాట్లాడుతూ నిరంతరం ప్రణాళికాబద్ధంగా కష్టపడితే గమ్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. సమావేశంలో ఎఫ్ఆర్‌ఓ రవికృష్ణ, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, మాజీ ఎంపీటీసీ చింతల రాజయ్య, హెచ్‌ఎం శ్యాంకుమార్, నరెడ్ల శ్రీధర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కేయూలో కొనసాగుతున్న ఎన్‌సీసీ క్యాంపు



కేడెట్లకు శిక్షణ ఇస్తున్న ఆర్మీ అధికారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఎన్‌సీసీ పదవ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్ల పది రోజుల క్యాంపు కొనసాగుతోంది. కేడెట్లకు సోమవారం ఆర్మీ విన్యాసాలు నిర్వహించారు. ఆర్మీలో నిర్వహించే మెళకువలు, శత్రువులను ఎలా ఎదుర్కోవాలో నేర్పిస్తూ యుద్ధభూమిని తలపించేలా విన్యాసాల ద్వారా కేయూ క్రీడామైదానంలో ఎన్ఎస్ఎస్ కేడెట్లకు శిక్షణ ఇచ్చారు. అనంతరం ఖోఖో, వాలీబాల్‌పోటీలు నిర్వహించారు దేశ సేవకు కేడెట్లు ఎలా సిద్ధంగా ఉండాలో శిక్షణ ఇచ్చినట్లు కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామదురై తెలిపారు. శిబిరంలో కమాండెంట్ రవిసుబరాయ్, కెప్టెన్ డాక్టర్ సతీష్, కెప్టెన్ డాక్టర్ సదానందం, సుబేదారి మేజర్ మమస్కంధం, లెఫ్టినెంట్ గణేష్, సెకండ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ సబిత, బాలురెడ్డి, సుజిత, సీత పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టాలి

కాశిబుగ్గ: బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువులపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని రాష్ట్రీయ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి నాగరాజు డిమాండ్ చేశారు. దాడులకు వ్యతిరేకంగా కాశిబుగ్గ వీధుల్లో సోమవారం ర్యాలీ నిర్వహించి కాశిబుగ్గ జంక్షన్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కోమాకుల నాగరాజు, పత్రి సుభాష్, బండి నగేష్, ముచ్చర్ల ప్రభాకర్‌రావు, నాగార్జున, శ్రవణ్, కోటి, రమేష్, సంజీవ్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

యువతే దేశ భవిత

హన్మకొండ అర్బన్: యువతే దేశ భవిత అని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత.. విదేశీ మోజు వీడి స్వదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా రూపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన పలువురు విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ఆంగ్ల విభాగాధిపతి ఆవుల మీనాక్షి, పీడీ సుజాత, అధ్యాపకులు బి.సువర్ణ, హెప్సిబా, రమేష్‌కుమార్, రాంరెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా నిలుద్దాం



విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

కేయూ క్యాంపస్: కేరళ రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలకు కొండ చరియలు విరిగిపడి సుమారు 286 మందికి పైగా మరణించారని వేలాది మంది నిరాశ్రయులయ్యారని సీఐటీయూ జాతీయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు బాధితుల సహాయార్థం కాకతీయ యూనివర్సిటీలో సోమవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ యూనివర్సిటీలో సేకరించిన రూ.13,280 లను వరద బాధితుల కోసం సీఐటీయూ జాతీయ కమిటీ ద్వారా సంఘీభావ నిధికి పంపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ యూనివర్సిటీ నాయకులు మెట్టు రవి, కచ్చకాయల చిరంజీవి, రామచందర్, దేశిని రవికుమార్, సందీప్, శోభ, దామెర కృష్ణ, సంఘాల శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే మెరుగైన ఉపాధి అవకాశాలు



నియామక పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్

రామన్నపేట: చదువుతోనే యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎల్‌బీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు అన్నారు. నగరంలోని ఎల్‌బీ కళాశాలలోని బీఎస్సీ (పొల్ట్రీ విభాగం) విద్యార్థులకు బెంగళూరుకు చెందిన హిమాలయ డ్రగ్ కంపెనీ ప్రతినిధులు సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ (సౌత్ ఇండియా) కె.ప్రదీప్, రీజినల్ మేనేజర్ (ఏపీ, తెలంగాణ) మద్దెల రమేష్‌బాబు, ట్రైనీ హెచ్‌ఆర్ మేనేజర్ వినోద్ హాజరై విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌మేళాలో కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. వారికి కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల పౌల్ట్రీ విభాగాధిపతి విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా యాత్ర



కాశిబుగ్గ: రైల్వేస్టేషన్ వద్ద భారీ జాతీయ జెండా

కాశిబుగ్గ: హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో నగరంలోని పోచమ్మమైదాన్ నుంచి చౌరస్తా మీదుగా వరంగల్ రైల్వే స్టేషన్ వరకు సోమవారం నిర్వహించిన తిరంగా యాత్ర ఉత్సాహంగా సాగింది. 75 అడుగుల పొడవు గల భారీ జాతీయ జెండాతో యాత్ర నిర్వహించారు. ర్యాలీని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ ప్రారంభించగా నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

హన్మకొండ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో హనుమకొండలోని అదాలత్ నుంచి హనుమకొండ చౌరస్తా వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ చౌరస్తాలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రత్నాలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

వరంగల్ చౌరస్తాలో..

వరంగల్ చౌరస్తా: ఈనెల 13నుంచి 15వ తేదీ వరకు ఇంటింటా జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ నాయకుడు గందె నవీన్ కోరారు. హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ చౌరస్తాలో జాతీయ జెండాలను సోమవారం పంపిణీ చేశారు. పార్టీ 28వ డివిజన్ అధ్యక్షుడు రామిని సుమన్, తాటికొండ రాము, కొత్తపెల్లి రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఖిలా వరంగల్: ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని వరంగల్ శంభునిపేట ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్‌స్టాలిన్ హాజరై మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై చదువు – పోరాడు అంటూ దేశ వ్యాపితంగా ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ల్యాదల్ల శరత్, సాగర్, మోటం శివకుమార్, మేకల అభిరామ్, మోరే రాజు, ప్రభాస్, సోను చౌహాన్, నిశాంత్, ఖలీల్, సంతోష్, రోజా, షాజియ, నాగజ్యోతి, కీర్తన, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వర్సిటీల పరిరక్షణకు ఉద్యమం

కేయూ క్యాంపస్: ప్రభుత్వ యూనివర్సిటీల పరిరక్షణకు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ యూనివర్సిటీల ఇన్‌చార్జ్ రహమన్ పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్‌వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఎగురవేసి ఆయన మాట్లాడారు. 1936, ఆగస్టు 12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్, సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, సభ్యులు పాల్గొన్నారు.

కూచిపూడిలో ‘టెంపుల్ డ్యాన్స్’ ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

హన్మకొండ కల్చరల్: రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ జాతీయ సంగీత నృత్య పోటీల్లో హనుమకొండకు చెందిన టెంపుల్ డ్యాన్స్ విద్యార్థులు కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరిచారని నృత్యగురువు హిమాన్సీ కాట్రగడ్డ తెలిపారు. జూనియర్ కూచిపూడి విభాగంలో గజం చన్విత ప్రథమ బహుమతి, జనన్య వర్మ స్పెషల్ బహుమతి, సీనియర్ కేటగిరిలో హన్విక ద్వితీయ బహుమతి సాధించారని పేర్కొన్నారు. ఈ మేరకు తిరుపతి మహతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం జరిగిందని తెలిపారు.

వైభవంగా శ్రావణ మాసోత్సవాలు



మెట్టుగుట్టపై అభిషేకం చేస్తున్న భక్తులు



కాశీ విశ్వేశ్వరాలయంలో పెరుగుతో అభిషేకం

మడికొండ: మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసోత్సవాలను వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం స్వామివారికి ప్రాతఃకాల రుద్రాభిషేకం చేసి అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. మధ్యాహ్నం స్వామివారికి అన్నపూజ చేసి అలంకరించారు. సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో..

కాశిబుగ్గ: కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున కాశీ విశ్వేశ్వరుడికి అర్చకులు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు 27కిలోల పెరుగుతో ఆలయంలోని సహస్ర లింగానికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నపూజ నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

సంక్షిప్తంగా

జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలి

నయీంనగర్: పేదలు, జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ అభ్యుదయ వాదుల ఐక్య వేదిక కన్వీనర్ చింతకింది కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి, ప్రభుత్వం ద్వారా పరిష్కారం చూపే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించే వారేలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దూడల సాంబయ్య, చీకటి ప్రకాష్, అకినెపల్లి వెంకటేశ్వర్లు, గాడిపెల్లి మధు, కొమ్మాల బాబు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు

ఖిలా వరంగల్: యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దని, చిన్నతనంలోనే జీవితాన్ని విచ్ఛిన్నం చేసుకోవద్దని డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్ సూచించారు. వరంగల్ శంభునిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ పీఓ వీరాంజనకుమార్ అధ్యక్షతన మాదక ద్రవ్యాల నిర్మూలనపై సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాములు నాయక్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పార్టీకి యువజన విభాగం పునాది

హసన్‌పర్తి: యువజన విభాగమే పార్టీకి పునాది అని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్‌రెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామంలో యువజన విభాగం ముఖ్య నాయకుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న దిలీప్, నియోజకవర్గ అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న ఆవుల పవన్, మండల యువజన విభాగం అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న సొరం చరణ్‌తేజా పాల్గొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మదన్, జీవన్‌రెడ్డి, భగత్, మాజీ ఉప సర్పంచ్ రాజు, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులుగా గుర్తించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో, వర్సిటీ కళాశాలల్లో పార్ట్‌టైం అధ్యాపకులుగా పనిచేస్తున్న వారిలో 16 పీరియడ్‌ల వర్క్‌లోడు కలిగిన వారిని కాంట్రాక్ట్ అధ్యాపకులుగా గుర్తించాలని కేయూ పార్ట్‌టైం అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్ట్‌టైం అధ్యాపకులు డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ మోహన్, పీహెచ్.ప్రవీణ్, శ్యాసుందర్‌చారి, లక్ష్మణ్, ఎడ్ల ప్రభాకర్, కిరణ్‌కుమార్ గౌడ్, నరేందర్, సుభాష్, మామిళ్ల కృష్ణ, సుమంత్, కుమారస్వామి, కమలాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈనెల 14న కేయూలో పార్ట్‌టైం అధ్యాపకుల నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు పార్ట్‌టైం అధ్యాపకుడు డాక్టర్ విజయకుమార్ తెలిపారు.

రా రైస్ మిల్లర్స్ అధ్యక్షుడికి శుభాకాంక్షలు

హన్మకొండ అర్బన్: తెలంగాణ రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పాడి గణపతిరెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీని సోమవారం సందర్శించిన సందర్భంగా ఆయనను రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, తదితరులు సన్మానించారు.

ఎమ్మెల్యేను కలిసిన పాడి గణపతిరెడ్డి

హసన్‌పర్తి: పాడి గణపతిరెడ్డి సోమవారం స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బొకే అందించి సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు వీసం సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దేవరకొండ అనిల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగళ్లపల్లి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగకు స్వాగతం పలుకుదాం

నయీంనగర్: ఎస్సీల వర్గీకరణ సాధించి మంగళవారం హైదరాబాద్‌కు వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతం పలుకుదామని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్‌మాదిగ విజ్ఞప్తి చేశారు. సోమవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పార్టీలు, సంఘాలకు అతీతంగా ప్రతీమాదిగ బిడ్డ తరలిరావాలని కోరారు.

ఒకేషనల్ కళాశాలలో స్వచ్ఛదనం – పచ్చదనం

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన

హన్మకొండ చౌరస్తా: యువత అనుకున్న రంగాల్లో నైపుణ్యత అభివృద్ధి సాధించాలని జాతీయ యువజన పురస్కార అవార్డు గ్రహీత పరశురాములు అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ సెంటర్‌లో యువతకు నైపుణ్యత అభివృద్ధిపై సోమవారం అవగాహన కల్పించారు. ఆఫీస్ సూపరింటిండెంట్ విజయశ్రీ, ఫ్యాకల్టీ సోనీ, శైలజ, నిషిత, నాగస్వరూప, తిరుపతి పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చాను బలోపేతం చేయాలి

కాశిబుగ్గ: వరంగల్ జిల్లాలో బీజేపీ ఎస్సీ మోర్చాను బలోపేతం చేయాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ సూచించారు. ఇటీవల జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా నియమితులైన పోలెపాక మార్టిన్ లూథర్‌ను సోమవారం సన్మానించారు. రేసు శ్రీనివాస్, బన్న ప్రభాకర్, మాదాసి రాజు, పోలెపాక జనార్దన్, వీరాస్వామి, కోటి, జన్ను కుమార్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

ఖిలా వరంగల్: విద్యుత్ కోతలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకుడు గద్దం యుగేందర్ కోరారు. ఈమేరకు కరీమాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏడీ సర్వేశంను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కృష్ణ, సల్ల సారంగం, నాగపూరి రవిచంద్ర, ఆవునూరి భాస్కర్ పాల్గొన్నారు.

జంగా రాఘవరెడ్డికి శుభాకాంక్షలు

మడికొండ: తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ చైర్మన్‌గా జంగా రాఘవరెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ఆయిల్ ఫాం సాగు చేసేవిధంగా చూడాలని కోరారు.

క్వాలిటీ కంట్రోల్ విభాగానికి ఎంపిక

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని బ్రిలియంట్ బయో ఫార్మాస్యూటికల్ క్వాలిటీ కంట్రోల్ విభాగానికి కేయూలోని బయో టెక్నాలజీ విభాగానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు అలేఖ్య, అయేషా సిద్దిఖీ ఎంపికయ్యారు.

ఎయిడ్స్‌పై అవగాహన రన్

కేయూ క్యాంపస్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో విద్యార్థులకు సోమవారం 5కే రన్ నిర్వహించారు.

ఆటో – బైక్ ఢీ.. పలువురికి గాయాలు

మడికొండ: ఆటో – ద్విచక్రవాహనం ఢీకొని పలువురికి గాయాలైన సంఘటన మడికొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జఫర్‌గఢ్ మండలం అలియాబాద్ గ్రామానికి చెందిన బి.మధు, గర్భవతి అయిన అతని భార్య సంధ్య, మరో మహిళ స్రవంతి కలిసి ఆటోలో వరంగల్‌లోని ఆస్పత్రికి వెళ్తున్నారు. ఈక్రమంలో మెట్టుగుట్ట ద్వారం వద్ద మడికొండకు చెందిన జిట్ట శ్రీనివాస్ బైక్.. ఆటో ఢీకొట్టాయి. దాంతో ప్రమాదంలో శ్రీనివాస్ కాలు విరగగా, ఆటో డ్రైవర్ తలకు, సంధ్య, స్రవంతికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

మడికొండ: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మహిళ మృతి చెందిన సంఘటన టేకులగూడెం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన ఆరుముళ్ల వినీత (35) వివాహేత సంబంధం ఆరోపణల నేపథ్యంలో ఈనెల 10న క్రిమిసంహార మందు తాగింది. చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ తెలిపారు.

బాలుడి అదృశ్యం

ఖిలా వరంగల్: ఉర్సు గుట్ట సమీపం ఎన్ఎన్‌నగర్‌కు చెందిన ఓ బాలుడు అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆదివారం ఉదయం కిరాణం షాపునకు వెళ్లి వస్తానని చెప్పి బయటికి వెళ్లిన పాదాల హరీశ్‌కుమార్ (16) సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పాదాల రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.